క్లుప్తంగా

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలోను షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ మాట్లాడుతూ సీజన్ వ్యాధులు, జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ఈవోఆర్డీ మీనా కుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వాకర్స్

పీఎం పాలెం: ప్రఖ్యాత సినీ గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంతిని బుధవారం జాతర వాకర్స్ అసోసియేషన్, పాటల పందిరి సభ్యులు వేడుకగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంటసాల కీర్తి అజరామరమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఘంటసాల ఆలపించిన మధుర సినీ గీతాలను పాటల పందిరి గాయనీ గాయకులు సుజాత వాణి, భాస్కరరావు, మహేశ్వరరావు, ప్రకాశరావు, నాయుడు, సూర్య ప్రసాద్ ఆలపించారు. కార్యక్రమంలో జావా అసోసియేషన్ సెక్రటరీ రామారావు, పాటల పందిరి అధ్యక్షుడు సత్యానంద, సత్యనారాయన, బాబూరావు, రాంప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

తగరపువలస: జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవన్ కోరారు. బుధవారం భీమిలి మండలంలో ఆయన పర్యటించారు. శింగనబంద పంచాయతీ డొకరపేటలో గ్రామ వికాస సమితికి చెందిన వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణను కలిసి ఏర్పాట్లు గురించి తెలియజేశారు. ఈ ప్రాంతానికి చెందిన ఎక్కువ మందితో హైందవ శంఖారావానికి తరలి రావాలని కోరారు.

సబ్‌స్టేషన్‌కు ట్రీ కటింగ్ మిషన్ అందజేత



ఏఈఈకి ట్రీ కటింగ్ మిషన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత అప్పలస్వామినాయుడు

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వేములవలస మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ అప్పలస్వామినాయుడు బుధవారం రూ.10వేల విలువైన ట్రీ కటింగ్ మిషన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల కొమ్మలు పెరుగుతుండడంతో విద్యుత్ వైర్లకు తగిలి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. చెట్ల కొమ్మలు తొలగించడానికి లేబర్ అందుబాటులో లేక విద్యుత్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గాను తాను సొంతంగా ట్రీ కటింగ్ మిషన్ కొనుగోలు చేసి అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు అర్జున్, అప్పలరాజు పాల్గొన్నారు.

రైతు బేజారు



స్టాల్స్ చాలక ఆరుబయటే విక్రయాలు చేస్తున్న దేవరాపల్లి రైతు

- కనీస సదుపాయాలు, స్టాల్స్ కరువు
- వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య
- చిన్నపాటి వర్షం పడితే అడుగు పెట్టలేని పరిస్థితి
- ఎమ్మెల్యే హామీ నెలలు గడుస్తున్నా ఆచరణ శూన్యం
- ఇదీ మధురవాడ రైతు బజార్ పరిస్థితి

మధురవాడ: అంగట్లో అన్నీ ఉన్నా..అల్లుని నోట్లో శని అన్నట్టు ఉంది... మధురవాడ రైతు బజార్ పరిస్థితి. ఇక్కడ సువిశాలమైన ప్రభుత్వ స్థలం ఉంది. హైవేకు ఆనుకుని నిత్యం వినియోగదారులతో కిటకిటలాడుతూ ఉంటుంది. పైగా సుమారు లక్ష జనాభాకు రైతు బజార్ ఒక్కటే అందుబాటులో ఉంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైతు బజార్‌పై పాలకుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. కనీస సదుపాయాలు కల్పించడం లేదు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జూలై 11న రైతు బజార్‌ను సందర్శించి, మార్కెట్ బయట వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపిస్తామన్నారు. రైతు బజార్ విస్తరణ, సదుపాయలు కల్పన, ట్రాఫిక్ సమస్యకు తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఆయన హామీని నిలబెట్టుకోలేదు.



రైతు బజార్‌లో విక్రయాలు చేస్తున్న రైతులు

రైతులకూ అవస్థలే..

రైతు బజార్‌కు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు పరిధిలోని 7 మండలాల నుంచి 30 గ్రామాలకు చెందిన 123 మంది సభ్యత్వం ఉన్న రైతులు కూరగాయలు విక్రయిస్తారు. అయితే కేవలం 84 స్టాల్సే ఉన్నాయి. మిగిలిన వారు ఆరుబయటే అమ్మకాలు సాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రైతు బజార్ గేటు వద్ద అనధికార వ్యాపారుల అమ్మకాలు వలన రైతులతో పాటు డబ్బులు కట్టి **స్టాల్స్ పొందిన డ్వాక్రా మహిళలు, వండ్ల వ్యాపారులు, రైతులు గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నారు.**



మధురవాడ రైతు బజార్ మెయిన్ గేట్ వద్ద అనధికార దుకాణాలు

అక్కడి నుంచే సమస్యలు మొదలు

జీవీఎంసీ మధురవాడ జోన్ కేంద్రం కొమ్మాది జంక్షన్ సమీపంలోని మధురవాడ రైతు బజార్ పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. దీనికి హైవే సర్వీసు రోడ్డు నుంచి లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 12 అడుగుల వెడల్పు గల రోడ్డులో రెండు వైపులా అనధికార దుకాణాలు... వాటి ముందే పార్కింగ్‌తో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో చాలా మంది వినియోగదారులు రైతు బజార్ లోపలికి రాకుండా బయట ఉన్న దుకాణాలు వద్దే కాయగూరలు కొనుగోలు చేసి వెనుదిరుగుతున్నారు. రైతు బజార్‌కు 100 మీటర్లు పరిధిలో కూరగాయల షాపులు ఉండకూడదని నిబంధనలు ఉన్నా..అమలు కావడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



రోడ్డుపైనే పార్కింగ్‌తో అవస్థలు

ఫ్లోరింగ్ లేక తీవ్ర ఇబ్బందులు



రైతు బజార్ ప్రాంగణం..బురదమయం

సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రైతు బజార్‌ను 2017లో ఏర్పాటు చేశారు. ఇక్కడ కనీసం ఫ్లోరింగ్ కూడా లేదు. చిన్నపాటి వర్షం పడితే బజార్ అంతా బురదగా మారుతుంది. అడుగు తీసి అడుగు పెట్టలేని పరిస్థితి. పార్కింగ్ ఫీజు తీసుకోవడమే తప్ప వాహనాలకు కనీస నీడ, రక్షణ చర్యలు చేపట్టడం లేదు. పైగా బురదలోనే పార్క్ చెయ్యాల్సి వస్తోంది. దీంతో చాలామంది రోడ్డు మీదనే పార్కింగ్ చేస్తున్నారు.

స్టాల్ లేక ఆరుబయటే విక్రయాలు



నేను కోటపాడు మండలం ఆర్ల గ్రామం నుంచి రోజూ రైతు బజార్‌కు సరకు తెస్తా..అయితే నాకు స్టాల్ ఇవ్వలేదు. రైతు బజారు ఎదుటే సరకు అమ్ముకోవాల్సి వస్తోంది. వర్షం వస్తే పెట్టుబడి, ఖర్చులు కూడా రాని రోజులు ఉన్నాయి. చాలా ఇబ్బందులు పడుతున్నా.

– కె. అప్పారావు, రైతు, కె. కోటపాడు, అనకాపల్లి జిల్లా

గిట్టుబాటు కావడం లేదు



నేను ఎంవీపీ కాలనీ జీవన జ్యోతి డ్వాక్రా గ్రూపు సభ్యురాలిని. నెలకి రూ. 3,600 కట్టి స్టాల్ తీసుకుంటున్నాను. రైతు బజార్ ఎదుట వేరే వాళ్లు అనధికారికంగా సరకులు అమ్ముతుండడంతో నా వరకు నష్టాలు చవి చూస్తున్నా..రైతు బజార్‌లో స్టాల్ ఇచ్చి ఏం ప్రయోజనం. మేం ఎలా బతికేది.

–వి. క్రాంతి, డ్వాక్రా మహిళ, విశాఖ

ఎదుగూ బొదుగు లేదు



నేను నెలకి రు.1500 కట్టి స్టాల్ తీసుకున్నా. రైతు బజార్‌లోకి రావడానికి దారి సక్రమంగా లేదు. దీంతో వినియోగదారులు రైతు బజార్ లోపలికి రావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైతు బజార్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి..బజార్ ఎదుట అనధికార షాపులను తొలగించాలి.

–దుక్క రమణమ్మ, వ్యాపారి, దుక్కవానిపాలెం

డుంబ్రిగుడ నుంచి వస్తున్నాం



పావలో... పరకో.. మిగులుతుందని ఏజెన్సీ డుంబ్రిగుడ నుంచి వస్తున్నాం. కాని ఆశించినంత వ్యాపారం లేదు. రైతు బజార్ చుట్టూ బురదే. వర్షం పడితే ఎవ్వరూ లోపలకి రాలేరు. రాత్రి పూట కూడా అంతంత మాత్రంగానే వినియోగదారులు వస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

–నరేష్, డుంబ్రిగుడ. ఏఎస్ఆర్ జిల్లా

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



తీవ్రంగా గాయపడిన అప్పలనాయుడు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో బుధవారం సాయంత్రం బస్సు ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని విలాస్కాన్‌పాలెం గ్రామానికి చెందిన బొడ్డు అప్పలనాయుడు (70)ను సింహాచలం నుంచి విజయనగరం వెళుతున్న ఆర్టీసీ బస్సు పద్మనాభం జంక్షన్‌లో ఢీకొట్టింది. ఈ సంఘటనలో అప్పలనాయుడుకు కుడి కాలు నుజ్జునుజ్జయింది. అప్పలనాయుడును 108 అంబులెన్సులో విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లంలోనే ధాన్యం



సంగివలసలో నూర్చిన ధాన్యం



తాటితూరులో టార్పాన్ల కింద ధాన్యం



మునివానిపాలెంలో మొలకలు వచ్చిన ధాన్యం

తగరపువలస : తుపాను ప్రభావం భీమిలి డివిజన్‌పై స్పష్టంగా కనిపించింది. రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. గత నెల 30లోగా పంట నూర్చి కల్లంలో ధాన్యం ఆరబోసిన రైతులు అకాల వర్షం నుంచి కాపాడుకోలేకపోయారు. కింద టార్పాన్లు వేసి పైన మరో టార్పాన్లతో మూసినా వరుసగా నాలుగు రోజుల పాటు కురిసిన వర్షానికి చాలాచోట్ల ధాన్యంలోకి నీరు చేరి మొలకెత్తింది. ఇవి కోళ్లమేతకు తప్ప ఎందుకూ పనికిరావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లో ఎలాంటి వసతులు లేని చిన్న రైతులే ఎక్కువగా నష్టపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టినా మబ్బుల వాతావరణం ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలా వరకు రైతులు పొలంలో నీరు ఉండగానే యంత్రాలతో కోతలు కానిస్తున్నారు. దీంతో పశువులకు గడ్డి రాదని అంటున్నారు. ప్రభుత్వం క్వింటాల్ సాధారణ రకానికి రూ.2300, ఏ గ్రేడ్ రకానికి రూ.2320 ఇచ్చి కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించినా వాస్తవంలో మాత్రం కనిపించడం లేదు. దీంతో ధాన్యాన్ని దాచుకోలేని రైతులు వచ్చిన కాడికి దళారీలకు అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం డివిజన్‌లో దళారీలో రైతులకు అడ్వాన్సుల ఆశ చూపి ధాన్యాన్ని తరలిస్తున్నారు. కొన్నిచోట్ల పంట కోతలకు ఇంకా పక్షం రోజులు గడువు ఉన్నందున భూములలో నిలిచిపోయిన నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేకుంటున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం రోడ్ల పక్కల పొలాలను పరిశీలించి కంటి తుడుపు చర్యలు చేపడుతున్నారు.

జలం.. గరళం

- శుభ్రం చేసి ఎంతకాలం అవుతుందో?
- తాగునీటి పథకాల్లో వ్యర్థాలు



సామియ్యవలసలోని రక్షిత మంచినీటి పథకం

తగరపువలస: గ్రామీణ ప్రాంతాలకు రక్షిత మంచినీటి పథకాల పేరుతో సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సురక్షిత తాగునీటి సరఫరాపై దృష్టి సారించడంలేదు. దీంతో భీమిలి నియోజకవర్గంలో చాలా వరకు రక్షిత మంచినీటి పథకాలు నాచుపట్టి, డెబ్రిస్‌తో జుగుప్సాకరంగా కనిపిస్తున్నాయి. వీటి నిర్వహణ గాలికి వదిలేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది కూడా పట్టించుకోలేదు. దీనికి సాక్ష్యంగా పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామియ్యవలసలోని 10వేల లీటర్ల టాంకు, పంప్ హౌస్‌ను చూస్తే అర్థమవుతుంది. ఈ పథకం మెట్లు శిథిలం కావడంతో వేసిన ఇనుప నిచ్చెన కూడా తుప్పు పట్టిపోయింది. ట్యాంకును శుభ్రం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. పోనీ దీని కిందే ఉన్న పంప్‌హౌస్ చూద్దామంటే ప్రహరీ కూలిపోయి లోపల, చుట్టూ నాచుకట్టి అడుగు మేర డెబ్రిస్ పేరుకుపోయింది. అక్కడే ఉన్న బోరులోకి నాచుకట్టిన గలీజు నీరు చేరుతోంది. ఈ నీటినే గ్రామానికి చెందిన 2 వేల మంది తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇక్కడి వారు నిరక్షరాస్యులు కావడంతో తాము తాగుతున్నది సురక్షితమైనది కాకుండా గరళమని తెలుసుకోలేకపోతున్నారు. ఇక్కడి నీరు తాగే ప్రజలు అనారోగ్యాలకు గురైనప్పుడు అధికారులు పరుగులు తీసేకంటే ముందు జాగ్రత్తగా శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.



పంప్‌హౌస్ లోపల నాచుకట్టి పెచ్చులూడిన దృశ్యం



పంప్‌హౌస్ ముందు శిథిలమైన ప్రహరీ







పంప్‌హౌస్ చుట్టూ పేరుకు పోయిన డెబ్రిస్

పాపం చేప పిల్లలు..!



మృతి చెందిన చేపలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ, కళ్లివానిపాలెం సమీపంలోని గెడ్డలో బుధవారం ఉదయం వందలాది చేపలు మృత్యువాత పడ్డాయి. ఒక్క సారిగా వందలాది చేపలు మృత్యువాత పడటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. కొమ్మాది, మారికవలస ప్రాంతాల్లో గల సీఫుడ్ కంపెనీలు నేరుగా గెడ్డల్లో రసాయన వ్యర్థాలు విడిచిపెడుతుండడంతో చేపలు మృతి చెందుతున్నాయి. ఈ సీఫుడ్స్ కంపెనీలపై గతంలో జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు వాపోతున్నారు. ఈ గెడ్డకు ఆనుకునే కొన్ని వందల ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారని, ఈ నీరు నేరుగా పొలాల్లోకి వెళ్తుందని దీని వలన పంట దిగుబడి తగ్గడమే కాకుండా పంటల్లో నాణ్యత లోపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలిథిన్ కవర్ల సీజ్



చెట్నీలను ప్యాక్ చేసిన పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న శానిటేషన్ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో బుధవారం పాలిథిన్ నిషేధంపై శానిటేషన్ సిబ్బంది వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంబేద్కరు కూడలి నుంచి గణేష్ థియేటర్ కూడలి వరకు హోటళ్లు, చికెన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాలిథిన్ కవర్లలో చెట్నీలు, టీ, చికెన్ ప్యాకింగ్ చేస్తున్నట్టు గుర్తించి హెచ్చరించారు. పాలిథిన్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. మరోమారు పాలిథిన్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడుతో పాటు వివిధ సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సంక్షేమం..అభివృద్ధిపై కూటమి నిర్లక్ష్యం



అవతార్ సింగ్ కుటుంబాన్ని పరామర్శించిన కార్పొరేటర్ ప్రియాంక

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డులో కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక బుధవారం ఉదయం కొమ్మాది, కె1, కె2, కె3 కాలనీల్లో పర్యటించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సమస్యలు అధికమయ్యాయని, పేదలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. సంక్షేమంలేక, అభివృద్ధి జరగక ప్రజలు అయోమయంలో ఉన్నారన్నారు. స్థానికుల నుంచి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కె3 కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అవతార్ సింగ్ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఇటీవల అవతార్ సింగ్ కుమారుడు రుషిత్‌సింగ్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె పరామర్శించారు. ఈమె వెంట నాయకులు ముత్తంశెట్టి మహేష్, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, గాదె రోశిరెడ్డి తదితరులు ఉన్నారు.

రెండు పాఠశాలల్లో 'న్యాస్' పరీక్షలు

పద్మనాభం: మండలంలోని రెండు పాఠశాలల్లో ఆరో తరగతి విద్యార్థులకు బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్ష నిర్వహించారు. మద్ది, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు ఈ పరీక్షలు నిర్వహించారు.

అయ్యప్ప సన్నిధానానికి స్వాములు



ఇరుముడితో రాముస్వామి

తగరపువలస: ఆనందపురం మండలం పొడుగుపాలెం నుంచి దీక్ష పూర్తి చేసుకున్న 50 మంది స్వాములు బుధవారం శబరిమలైలోని అయ్యప్పస్వామి సన్నిధానానికి బయలువేరి వెళ్లారు. వీరు ద్వారపూడి, విజయవాడ, మధురై, పళని మీదుగా వెళ్లనున్నారు. వీరిలో గురుస్వామి బంటుపల్లి రాము 18వ సారి దీక్ష చేసి యాత్రకు వెళ్తుండటంతో స్థానికులు ఘనంగా సత్కరించారు.

భూసార పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకిలో బుధవారం భూసార పరిరక్షణపై వాల్తేరు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఆర్సీ ఏడీఏ చదువుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భూసార పరిరక్షణలో విద్యార్థుల పాత్రను తెలియజేశారు. విద్యార్థుల ద్వారా రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించి వాటి ఫలితాలను వివరించారు. పంట సాగులో ఎరువులు, పురుగుల మందుల వినిగాయాన్ని వివరించారు. కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయుడు ఎర్రయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులను వ్యవసాయ, భూసార పరీక్షలలో మమేకం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏడీఏ హరికృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పి.అప్పలనాయుడు, ఉపాధ్యాయురాలు కల్పన, ఏఈవో స్వాతి, వ్యవసాయశాఖ సహాయకుడు జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని వెల్లంకి, వేములవలస పంచాయతీలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రబీలో రాగి పంట సాగు గురించి తెలియజేశారు. రాగి విత్తనాలను రాయితీపై అందిస్తున్నామన్నారు. రైతులు తాము వేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్సీ ఏడీఏ సుబ్రహ్మణ్యం

124 బస్తాల పీడీఎస్ బియ్యం సీజ్

తగరపువలస : ఆనందపురం మండలం పెద్దిపాలెంలో గల శ్రీవాసవి ఎంటర్ ప్రైజస్ రైస్ మిల్లులో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లెక్కల్లో లేని 124 బ్యాగుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ మిల్లుపై 6ఎ కేసు నమోదు చేశారు. గత ఆరు నెలల కాలంలో పౌరసరఫరాల శాఖ నగర పరిధిలో 6ఎ కేసులు 123 నమోదు చేశారు.

రూ.17.90 లక్షల విలువ చేసే 114.573 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. అక్రమ బియ్యం రవాణాకు వినియోగించిన 13 వాహనాలను సీజ్ చేసి ఆరుగురు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎవరైనా సరే బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.